క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు



బోర్‌వెల్ ప్రారంభిస్తున్న ఎంపీటీసీ, నాయకులు

ధర్మపురి: జైనాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని తెలుపడంతో రెండు బోరింగులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని జైనా పెద్దమ్మ గుడి వద్ద భక్తుల సౌకర్యార్థం, అదే విధంగా గ్రామంలోని నేతకాలనీ కాలనీలో అధికంగా తాగునీటి సమస్య ఉండడంతో మరో బోరింగ్‌ను మంజూరు చేశారు. ఆదివారం రెండు బోరింగులను ఒకే రోజు ప్రారంభించి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంట రజిత, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణులు

కథలాపూర్: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కథలాపూర్ మండలం అంబారిపేట విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం వేములవాడలో కలిశారు. సంఘం భవనానికి నిధులు, వీరబ్రహ్మంగారి దేవాలయం వద్ద బోరుబావి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు లక్కాకుల సద్గురుచారీ, శ్రీరాముల ప్రకాశ్, తిరుమల్, మహేశ్, జనార్దన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ముస్లిం విద్యార్థుల విరాళం



విరాళం అందజేస్తున్న విద్యార్థులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి ముస్లిం విద్యార్థులు రూ.5 వేల విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్‌కు ఆదివారం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఫోర్ట్స్ హై స్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులు ఆశ్రమాన్ని సందర్శించి, వృద్ధుల బాగోగులను తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, విరాళం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహ్మద్ సమీరోద్దీన్, అస్మా కౌసర్, ఖాసియా ఫాతిమా పాల్గొన్నారు.

కరాటేలో గంభీర్‌పూర్ విద్యార్థికి ఎల్లో బెల్ట్



ఎల్లో బెల్ట్ ప్రదానం చేస్తున్న సుమన్

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన జవ్వాజి మహన్ అనే రెండో తరగతి విద్యార్థి కరాటేలో ప్రతిభ చాటి ఎల్లో బెల్ట్ అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సినీ హీరో సుమన్ చేతులమీదుగా ఆదివారం ఎల్లో బెల్ట్‌ను అందించారు. మహన్ హైదరాబాద్‌లోని గోల్డెన్ డ్రాగన్ కరాటే అకాడమీలో ఆరు నెలలుగా కరాటేలో శిక్షణ పొందారు. మహన్ ఎల్లో బెల్ట్ అందుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్యవైశ్యుల హర్షం



మాట్లాడుతున్న ఆర్యవైశ్యులు

కోరుట్లటౌన్: పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిన టీటీడీ కల్యాణ మండలం నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు రూ.70 లక్షల నిధులు మంజూరు చేయించడంతో ఆర్యవైశ్యసంఘం నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. వారికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అల్లాడి శ్రీనివాస్, కోటగిరి ప్రసాద్, పడిగెల శ్రీనివాస్, నేతి శ్రీనివాస్, మంచాల మహేశ్, రేగొండ మహేశ్, కంటాల రవీందర్, ఉప్పగండ్ల అశోక్, ఎల్లంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు.. తిప్పలు

- గృహజ్యోతిపై గందరగోళం
- ప్రజాసేవా కేంద్రానికి పరుగెడుతున్న వినియోగదారులు



కథలాపూర్‌లో మళ్లీ దరఖాస్తు చేయడానికి బారులు తీరిన జనం

కథలాపూర్: గృహజ్యోతి పథకంలో అర్హత ఉన్నప్పటికీ జీరో బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించినవారికి బిల్లులు రావడంలేదు. ఈ నెల ఒకటో తేది నుంచి ట్రాన్స్‌కో సిబ్బంది ఇంటింటా తిరిగి విద్యుత్ మీటర్ రీడింగ్‌లు చూసి రశీదులు ఇస్తున్నారు. కొందరికి జీరో బిల్లులు రాగా.. అర్హులైన మరికొందరికి బిల్లులు రావడంతో గందరగోళానికి గురవుతున్నారు.

మండలంలో 12,858 గృహ విద్యుత్ కనెక్షన్లు

మండలంలో 19 గ్రామాలుండగా.. 12,858 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి పథకంలో 8,295 మంది ఇప్పటికే లబ్ధిదారులున్నారు. ట్రాన్స్‌కో లెక్కల ప్రకారం మండలంలో 64.5 శాతం మంది గృహజ్యోతిలో లబ్ధిపొందుతున్నారని ప్రకటించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునే సమయంలో తప్పుడు వివరాలు నమోదు చేయడంతో గృహజ్యోతి వర్తింపజేయాలని పలువురు మండల పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

తప్పులతోనే ఇబ్బందులు..

ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులు ఉండటం వల్లే గృహజ్యోతి అమలు కావడంలేదని అధికారులు పేర్కొంటున్నారు. దరఖాస్తుల్లో వివరాలు సరిగా ఉన్నవారికి విద్యుత్ యూనిట్లు నమోదు చేయగానే బిల్లు మొత్తం రూపాయలు వచ్చి సబ్సిడీ మేరకు బిల్లు మొత్తం జీరో రూపాయలు అని వస్తుంది. వివరాలు సరిగాలేని వారికి మాత్రం బిల్లు వస్తోంది. దరఖాస్తు చేసుకునే సమయంలో సర్టిఫికెట్లు సరిగా అందించకపోవడం, మీటర్ నెంబర్ తప్పుగా నమోదు చేయడం, ఒకరి పేరున మీటర్.. మరొకరి పేరిట రేషన్ కార్డులు ఉండటం, మృతి చెందిన వారి పేరిట మీటర్లు కలిగి ఉండటం, వారికి సంబంధించిన ఆధార్‌కార్డులు లేకపోవడంతో, అనుసంధానం చేసుకోకపోవడం లాంటి సమస్యల వల్ల జీరో బిల్లులు రావడంలేదని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 300 బిల్లు వచ్చింది



ప్రజా పాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు పెట్టుకున్న. ఈ నెలలో విద్యుత్ బిల్లు రీడింగ్ నమోదు చేసి రూ. 300 చెల్లించాలని రశీదు ఇచ్చారు. గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ అని చెప్పి మళ్లీ బిల్లు చెల్లించమని చెప్పడం దారుణం. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు మంజూరుకు తిప్పలు పెట్టడం సరికాదు.

– బైండ్ల వెంకటేశ్, తాండ్ర్యాల,కథలాపూర్

ఇవేమి తిరకాసులు



ప్రజా పాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు ఇచ్చిన. అందరిలాగానే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని సంబరపడ్డా. ఇటీవల విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి బిల్లు చెల్లించాలని రశీదు ఇచ్చారు. పెళ్లయి నాలుగేళ్లు అయినా మా కుటుంబానికి రేషన్‌కార్డు లేదు. నిబంధనల పేరిట జాప్యం చేయకుండా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు త్వరగా వర్తింపచేయాలి. – బెజ్జారపు ప్రవీణ్, భూషణరావుపేట

దరఖాస్తు చేసుకోవాలి



జీరో బిల్లు రాని వారు ఆందోళన చెందవద్దు. అర్హులందరికీ జీరో బిల్లు వస్తుంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసే సమయంలో తప్పులుంటే మండల పరిషత్ కార్యాలయాల్లోని ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు అవసరమైన పత్రాల జిరాక్స్‌లు జతపరచాలి. అర్హులందరికీ జీరో విద్యుత్ బిల్లులు వస్తాయి.

– రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ కోరుట్ల

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

- కల్వర్టు వద్ద తరచూ ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



దెబ్బతిన్న కల్వర్టు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు బోల్తాపడ్డ లారీ (ఇన్‌సెట్‌లో)

మెట్‌పల్లిరూరల్: నిత్యం వందల సంఖ్యల వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ఓ కల్వర్టు ప్రమాదాలకు నెలవుగా మారింది. రహదారి మధ్యలో ఒర్రె ఉండడంతో అక్కడ నిర్మించిన కల్వర్టే ఇప్పుడు ప్రమాదాలకు కారణమవుతోంది. ఇటీవలి కాలంలో ఆ కల్వర్టు వద్ద తరచూ ప్రమాదాలు జరగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దృష్టి సారించాల్సిన అధికారులు మిన్నుకుండిపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

కల్వర్టు వెడల్పు తక్కువగా..

మెట్‌పల్లి మండలం మేడిపల్లి–వెంకట్రావుపేట మధ్య 63వ జాతీయ రహదారిలో ఒర్రెపై నిర్మించిన కల్వర్టు వద్ద ఏ మాత్రం అదమరిచినా ప్రమాదానికి గురికాక తప్పదు. నిత్యం ఈ మార్గం గుండా భారీ,ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కల్వర్టు నిర్మాణం సరిగ్గా చేపట్టకపోవడంతో అక్కడ తరచూ ప్రమాదాలు జరగుతున్నాయని స్పష్టం అవుతోంది. రహదారి కంటే కల్వర్టును తక్కువ వెడల్పులో నిర్మించారు. ఈ కారణంగానే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. కాగా ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు ఘటన స్థలాన్ని అలా పరిశీలించి ఇలా వెళుతున్నారే తప్పా ప్రమాదాలకు కారణమేంటి,తరచూ ఎందుకు జరుగుతున్నాయనే వాటిపై దృష్టి సారించడంలేదు. మరోవైపు కల్వర్టు పైకి వాహనాలు దూసుకుపోవడంతో పూర్తిగా దెబ్బతింది. దీంతో తాత్కాలికంగా అక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

ఎన్నో ప్రమాదాలు..

గత కొంత కాలంగా ఈ కల్వర్టు వద్ద ఎన్నో ప్రమాదాలు జరిగాయి.ఇటీవల సైతం రెండు లారీలు బోల్తా పడ్డాయి. ఆయా ప్రమాదాల్లో లారీ డ్రైవర్లు గాయాలతో బయటపడ్డారు. ఇవే కాకుండా ఎంతో మంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారు. కానీ తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నా కల్వర్టు విషయంలో శాశ్వత పరిష్కారం కోసం దృష్టి సారించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



కల్వర్టు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో అక్కడ కల్వర్టు దగ్గరికి రాగానే చాలా జాగ్రత్త పడాల్సిందే. ఏ మాత్రం చూసుకోకున్నా ప్రమాదానికి గురికాక తప్పదు. కల్వర్టు వద్ద రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– శంకర్,దబ్బా

నిరుపేద వృద్ధుడికి అంత్యక్రియలు



చంద్రయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న సభ్యులు

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో మార్క చంద్రయ్య(68) అనే నిరుపేద వృద్ధుడు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా, గ్రామంలోని విజేత, యంగిస్తాన్ యూత్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వృద్ధుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. సొంతిల్లు లేకపోవడంతో గ్రామశివారులోని పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితుల్లో ఇంటిపెద్దను కోల్పోయిన ఆ కుటుంసభ్యులు రోదిస్తున్నతీరు అందరిని కలిచివేసింది. గ్రామంలోని పలువురు నాయకులు, విజేత, యంగిస్తాన్ యూత్ సభ్యులు కలిసి సొంత ఖర్చులతో వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి ఆర్థిక సహకారం అందిస్తామని యువకులు పేర్కొన్నారు.

ప్రధాని సభకు తరలిరావాలి

సారంగాపూర్: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం జగిత్యాలలోని గీతా విద్యాలయం మైదానంలో జరిగే విజయసంకల్ప సభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆదివారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో పర్యటించి మోదీ సభకు తరలిరావాలని కోరారు.

ఇటిక్యాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో అధ్యయనోత్సవం నిర్వహించారు. ఈ నెల 26 వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు జగన్ మోహనాచార్యులు తెలిపారు.

పది పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్



రామకృష్ణ, ఎస్సై

పెగడపల్లి: ఈ నెల 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్ విధించినట్లు పెగడపల్లి ఎస్సై జాడి రామకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం మాట్లాడారు. ఆదర్శ మోడల్ స్కూల్లో నిర్వహించే పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. కేంద్రం వద్ద ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండ కూడదన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతారణంలో పరీక్షలు రాసుకునేందుకు సహకరించాలని కోరారు. పోలీసులు సూచించిన సరిహద్దులు దాటి కేంద్రాల వద్దకు వచ్చే ప్రయత్నం చేయకూడదన్నారు. పరీక్షలు ముగిసే వరకు ఈ కేంద్రం వద్ద 144 సెక్షన్ కొనసాగుతుందని ప్రజలు గమనించాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

మల్యాల: పదో తరగతి పరీక్షల కోసం సర్వం సిద్ధం చేశామని, పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 571మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ మేరకు మల్యాల మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మల్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో 254మంది, తాటిపల్లి బాలికల కళాశాలలో 140మంది, రామన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 177 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పోచమ్మ బోనాలు తీసి దేవతకు నైవేద్యం సమర్పించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. బోనాల ఊరేగింపులో విన్యాసాలు, డీజే పాటలతో యువకులు హోరెత్తించారు.

రాజ్యాంగ రక్షణే ధ్యేయంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న డా. రవీంద్రనాథ్

కోరుట్లటౌన్: రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా ఉద్యమించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి నిజామాబాద్ జిల్లా కన్వీనర్ డా. రవీంద్రనాథ్ సూరి పిలుపునిచ్చారు. కోరుట్లలో ఆదివారం ప్రజాసంఘాల జేఏసీ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుల,మత, భాషాపరంగా విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే వాళ్లకు ఓటుతో ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. సమాజ భవిష్యత్‌ను కాపాడుతూ నవ సమాజ నిర్మాణానికి పనిచేయాలన్నారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ పొందిన పేట భాస్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి కో ఆర్డినేటర్ షేక్ హుస్సేన్, నాయకులు చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, ఇల్యాస్‌ఖాన్, మహ్మద్ షేక్, రాస బూమయ్య, సుతారి రాములు, రామిండ్ల రాంబాబు, ముక్రం, జావీద్, శంబోజీ, రాజేశ్, మధు, రామయ్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వైశ్య కార్పొరేషన్ ఏరాపటు చేస్తామని ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు, ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు జక్క దయాకర్, ఊటూరి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు తాటికొండ రవితేజ, కోశాధికారి కల్లూరి రాజు , సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత



పెళ్లి సామగ్రి అందిస్తున్న, ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన మద్దినేని లావణ్య అనే నిరుపేద యువతి వివాహానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చేయూత అందించారు. ఈ సందర్భంగా ఆదివారం యువతి కుటుంబ సభ్యులకు ట్రస్ట్ సభ్యులు పుస్తెమెట్టెలు, పట్టుచీర, 150 మందికి భోజనాలకు కావాల్సిన సరిపడా సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్,సభ్యులు గణేశ్, రాంప్రసాద్, నరేశ్, మణిదీప్, మనోజ్, శివ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

మెట్‌పల్లి: గ్రామాలు,పట్టణాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మెట్‌పల్లి మున్సిపాలిటీకి ఎస్‌సీఎఫ్ నిధుల నుండి రూ.50 లక్షల 8 వేలు, మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలకు రూ.20 లక్షల 80 వేలు నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు కృష్ణారావు కృషితోనే నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోరుట్ల రూరల్: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మెట్‌పల్లి మండలంలోని చింతలపేటలో మల్లన్న జాతర ఉత్సవాల్లో, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో మడేలయ్య స్వామి 15వ వార్షికోత్సవంలో పాల్గొని, మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌లో నంది విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

కోడ్ ఎఫెక్ట్..

మెట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు మున్సిపల్ అధికారులు ముసుగులు వేశారు. గోడలపై వాల్ రైటింగ్స్, పోస్టర్లు, ఫ్లెక్సీలు లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

